
సాక్షి
వైఎస్సార్ జిల్లా

సోమవారం । 13 । ఫిబ్రవరి । 2023



హత్యరాల.. బ్రహ్మోత్సవాల వేళ

శైవ క్షేత్రమైన హత్యరాలలో శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. -8లో..



దైవ దర్శనానికి వెళ్తుండగా..

దైవ దర్శనానికి వెళ్తున్న వారి కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనండంతో ఇద్దరు మృతి చెందారు. -8లో..

గరిష్టం/కనిష్టం
35.9/15.2

వాతావరణం

జిల్లాలో ఆదివారం 15.2 – 35.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు తవ్వా వెంకటయ్యకు అభినందన సభ

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన యువ రచయిత, సాహిత్య పరిశోధకులు డాక్టర్ తవ్వా వెంకటయ్యకు సోమవారం ఉదయం 10 గంటలకు కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో అభినందన సభ నిర్వహించనున్నట్లు బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూలమల్లికార్జునరెడ్డి తెలిపారు. డాక్టర్ వెంకటయ్యను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అధికారభాషా సంఘం సభ్యుడిగా నియమించిన విషయం తెలిసిందే. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కడప నగరంలోని పలు సాహిత్య సంస్థలు కలిసి ఆయనను అభినందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు.

15 నుంచి శనగల కొనుగోలు



సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: జిల్లాలోని రైతుల నుంచి శనగలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ విషయమై ఆదివారం రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఎండీతో ఫోన్‌లో చర్చించామని, ఈ నెల 15వ తేదీ నుంచి కొనుగోలును ప్రారంభిస్తామని ఆయన తెలిపారన్నారు. అందువల్ల రబీకి సంబంధించి రైతులు ఈ క్రాప్, ఈకేవైసీ చేయించుకోకపోతే తక్షణం చేయించు కోవాలన్నారు.శనగలు అమ్ముదలచుకున్న వారు తమ పరిధిలోని రైతుభరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సంబటూరు ప్రసాద్ రెడ్డి సూచించారు. శనగ ధర ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో తక్కువగా ఉందని, ప్రభుత్వం కొనుగోలు చేసే రెటు ఎక్కువగా ఉందన్నారు. కావున రైతులందరూ ప్రభుత్వానికే విక్రయించి లాభాలు పొందాలని తెలిపారు.

15న జిల్లాలో సాగు నీటి ప్రాజెక్టుల పరిశీలన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులను సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 15న పరిశీలించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం కడపలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చాలా సాగు నీటి ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. 13న తుంగభద్ర ప్రాజెక్టు, 15న రాజోలి ఆనకట్ట, బ్రహ్మసాగర్, గండికోట జలాశయం, వామికొండ రిజర్వాయర్, వెలిగల్లు ప్రాజెక్టులను పరిశీలించనున్నట్లు చెప్పారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఓబులేసు, జి. ఈశ్వరయ్య, హరినాథ్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పులి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, కేసీ బాదుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధిలోని దొరసానిపల్లె జెడ్పీ హైస్కూల్ మైదానంలో ఆదివారం ఉమ్మడి వైఎస్సార్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అండర్–20 జిల్లా బ్యాడ్మింటన్ బాలబాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. బాలురు 16 మంది, బాలికలు 10 మందిని జిల్లా జట్లకు ఎంపిక చేశారు. మార్చి 5, 6, 7 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శంకర్‌రెడ్డి, సుధాకర్ రావు, ఎంపికల కన్వీనర్ నందకిశోర్ గౌడ్, మేరిసుప్రియ, వెంకటరమణ, సుజాత, ఏపీ స్టేట్ బాల్‌బ్యాడింటన్ మాజీ కార్యదర్శి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై నేడు టూరిస్ట్ పోలీసు ప్రారంభం

బి.కొత్తకోట: ఆంధ్రాఊటీగా పేరుగాంచిన బి.కొత్తకోట మండలం హార్సిలీహిల్స్‌పై సోమవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరిగే టూరిస్ట్ పోలీసు (పోలీసు ఔట్‌పోస్టు) కేంద్రం ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఆదివారం అన్నమయ్య జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటక ప్రాంతాల్లో సందర్శకులకు భద్రత కల్పించడం కోసం ప్రభుత్వం టూరిస్ట్ పోలీసు విధానం అమలులోకి తీసుకొచ్చింది. ప్రత్యేక పోలీసులను నియమించి శాంతిభద్రతలను పర్యవేక్షించడం, సందర్శకులకు అవసరమైన సమాచారం ఇవ్వడం, వారి ఇబ్బందులను తెలుసుకొని పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ పద్ధతిలో టూరిస్ట్ పోలీసు కేంద్రాన్ని సోమవారం ప్రారంభిస్తారు. దీనికోసం ముందస్తు ప్రారంభోత్సవ ఏర్పాట్లలో భాగంగా విజయవాడ పోలీసు ప్రధాన కేంద్రం నుంచి అడిషనల్ డీజీ రవిశంకర్ నిర్వహించిన ట్రయల్‌రన్‌లో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పాల్గొన్నారు.

కడప విమానాశ్రయానికి కొత్త సొబగులు

- రూ.100 కోట్లతో పూర్తయిన పనులు
- ఒకేసారి ఏడు విమానాలు నిలబడేలా పార్కింగ్ స్టాండ్లు
- 4 చోట్ల కొండలపై సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- అందుబాటులోకి నైట్ ల్యాండింగ్
- మరిన్ని విమానసర్వీసుల నిర్వహణకు ఆస్కారం

కడప ఎయిర్‌పోర్టు





సాక్షి ప్రతినిధి, కడప: కడప విమానాశ్రయాన్ని అధునాతన హంగులతోఅద్భుతంగాతీర్చిదిద్దారు. విమానాల పార్కింగ్ మొదలుకొని నైట్ ల్యాండింగ్ వరకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చారు. జాతీయ స్థాయిలో కడప పేరు మారుమోగేలా అత్యంత సుందరంగా రూపొందించారు. రూ.100 కోట్ల వ్యయంతో రన్‌వే విస్తరణ, పెరిమీటర్ లైటింగ్ పనులు, సివిల్, ఎలక్ట్రికల్ కమ్యూనికేషన్, ప్రహరీ, పార్కింగ్, తదితర అభివృద్ధి పనులు దాదాపుగా పూర్తయ్యాయి. నైట్ ల్యాడింగ్‌కు సంబంధించి అవసరమైన కాంపౌండ్ చుట్టూ లైటింగ్ పనులు తుదిదశకు చేరాయి.

- వైఎస్సార్ జిల్లా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ విమానాశ్రయాన్ని జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర విమానయానశాఖ సిద్ధపడింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చొరవతో ప్రధానంగా విశాఖపట్నం, తిరుపతి విమానాశ్రయాలకు దీటుగా కడప ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దుతున్నారు. ఏవియేషన్ అధికారులతో ప్రభుత్వ పెద్దలు పలుమార్లు సంప్రదింపులు నిర్వహించి జాతీయ స్థాయికి దీటుగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు చేపట్టారు.

నైట్ ల్యాండింగ్‌కు ఏర్పాట్లు...

కడప ఎయిర్‌పోర్టు దినదినాభివృద్ధి చెందింది. గతంలో రెండు విమాన పార్కింగ్ స్టాండ్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఏడు విమానాల పార్కింగ్ స్టాండ్లు పూర్తయ్యాయి. విమానయాన అవసరాలకు తగ్గట్లుగా ఎయిర్‌పోర్టును తీర్చిదిద్దుతున్నారు. ఒకేసారి ఏడు ఎయిర్‌క్రాఫ్టులు నిలబడేలా కొత్త పార్కింగ్ స్టాండ్లు పూర్తయ్యాయి. అదేవిధంగా విమానాల నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన విస్తరణ పనులు దాదాపు పూర్త య్యాయి. నైట్ ల్యాడింగ్ కోసం ఆబ్‌స్టల్ లైటింగ్ ఏర్పాటు, ఆరు టవర్ల నిర్మాణం ద్వారా విమానాశ్రయ ప్రాంతం పూర్తి స్థాయిలో కనిపించేందుకు ఈ లైటింగ్, ప్రహరీచుట్టూ పెరిమీటర్ లైటింగ్ (కాంపౌండ్‌పై 50 మీటర్ల దూరానికి ఓ లైటు) అమర్చారు. ఇలా చుట్టూ అమర్చడం ద్వారా ఎయిర్‌పోర్టు మొత్తం పెరిమీటరు లైటింగ్‌తో కొత్త కాంతులతో కళకళలాడుతోంది. ఉన్నతాధికారుల తనిఖీలు కూడా పూర్తి అయ్యాయి. అనుమతులు రావడమే తరువాయి. కాగా టెర్మినల్ బిల్డింగ్ అవసరానికి తగ్గట్లు పెంచుకోవాల్సి ఉంది.

అప్రోచ్ కంట్రోల్ యూనిట్‌కు ఏర్పాటు...

ఎయిర్‌పోర్టుకు చుట్టూ కొండ ప్రాంతాలు ఉండడంతో అందుకు సంబంధించి కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయి. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర మంత్రి, ఏవియేషన్ ఉన్నతాధికారులతో చర్చించి త్వరితగతిన సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నారు. 20 నాటికల్ మైల్స్ దూరంలో లంకమల అడవులు (కొండలు) ఉన్న నేపథ్యంలో విమానాల రాకపోకలకు అంతరాయం లేకుండా చుట్టూ కొండలపై ఎర్రటి లైట్లు ఏర్పాటు చేశారు. కడప నగరంలో కూడా ఎత్తయిన టవర్స్, సెల్ టవర్స్‌పై సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు.

సుందరీకరణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టుకు సంబంధించి సుందరీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోడ్లు, పార్కింగ్, మొక్కలతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ప్రయాణికులు వాహనాల్లో వెళుతుండగా అటు, ఇటువైపు పూల మొక్కలు, పచ్చదనం ఆహ్లాదకరంగా కనువిందు చేస్తున్నాయి. ఎయిర్‌పోర్టు ముందు భాగం నుంచి రోడ్డు వెంబడి టెర్మినల్ వరకు వాతావరణం చూస్తే ఎయిర్‌పోర్టుకు కొత్త కళ వచ్చినట్లు కనిపిస్తుంది. రోడ్లు, సుందరీకరణ, పార్కింగ్ తదితర వసతులకు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అద్భుతంగా తీర్చిదిద్దారు. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చొరవతో సుమారు రూ.100 కోట్ల అభివృద్ధి పనులతో కొత్త కళ సంతరించుకోనుంది.

పూర్తయిన రన్‌వే విస్తరణ పనులు

జిల్లా కేంద్రమైన కడప సమీపంలోని తోళ్లగంగనపల్లె వద్ద ఉన్న ఎయిర్‌పోర్టు రన్‌వే విస్తరణ పనులు పూర్తయ్యాయి. 2515 మీటర్ల పొడవుతో పనులు చేపట్టారు. ప్రస్తుతానికి 1715 మీటర్ల మేర రన్‌వే ఉండగా, దాన్ని 2515 మీటర్లకు పెంచి విస్తరించారు. ఈ పనులు పూర్తి కావడంతో విమానాల రాకపోకలకు మరింత అనువుగా మారింది. ల్యాండింగ్, ఫ్లైయింగ్‌కు ప్రధానం కానున్న రన్‌వే అద్భుతంగా తీర్చిదిద్దారు. ఎయిర్ బస్ ల్యాండింగ్ కోసం కావాల్సిన సౌకర్యాలన్నీ కడప విమానశ్రాయంలో వచ్చి చేరాయి.



కడప ఎయిర్‌పోర్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు



ఎయిర్‌పోర్టులో చెక్ ఇన్ ప్రాంతం

ఎంపీ చొరవ అభినందనీయం



కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధి కోసం పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవ అభినందనీయం. ఏవియేషన్ అధికారులతో పలుమార్లు ప్రత్యేకంగా సమావేశమై ఎయిర్‌పోర్టు విస్తరణకు శ్రమించారు. నైట్ ల్యాండింగ్ అనుమతులు వస్తే ఇక్కడి నుంచి విమాన సర్వీసులు అధికం కానున్నాయి. గల్ఫ్ దేశాలకు వెళ్లే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనకారిగా నిలవనుంది.

– బీహెచ్ ఇలియాస్, ఏపీ ఎన్ఆర్‌టీఎస్ డైరెక్టర్

నైట్ ల్యాండింగ్‌తో రాయలసీమ వాసులకు ఉపయోగకరం



కడప విమానాశ్రయంలో విమానాలు నైట్ ల్యాండింగ్ కావడం వల్ల రాయలసీమ వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఇప్పటివరకు పగలు మాత్రమే హైదరాబాద్, చెన్నై, విజయవాడ, విశాఖపట్టణం, బెల్గాం నగరాలకు విమానాలు నడుస్తున్నాయి. గల్ఫ్ దేశాలకు వెళ్లేందుకు కడప నుంచి లింక్ ఫ్లైట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే విమానాలు రాత్రి కూడా నడిపితే ప్రయాణికులకు సమయం ఎంతో ఆదా అవుతుంది. ఇందుకోసం కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు.

– ఆర్వీ రమణ, ఎన్ఆర్ఐ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో 'వెన్నపూస'ను గెలిపించాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు చంద్రశేఖర్‌రెడ్డి

కడప రూరల్: త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని ప్రభుత్వ సలహాదారు (ఉద్యోగుల సంక్షేమం) ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులుగా బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని వైఎస్సార్ సమావేశ మందిరంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన, కరోనా లాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన సజావుగా సాగేలా అన్ని చర్యలు చేపడుతోందన్నారు. దేశంలోనే ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అతి పెద్ద సంస్థ అన్నారు. ఉద్యోగుల సమస్యలు ఈ అసోసియేషన్ ద్వారానే పరిష్కారం అవుతాయన్నారు. కొన్ని ఉద్యోగ సంఘాల వారు తమ నోటికి వచ్చినట్లు మాట్లాడటం తగదన్నారు. ప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళుతోందన్నారు. ఈ నేపథ్యంలో మనవంతుగా ప్రభుత్వానికి అండగా నిలవాలన్నారు. పరస్పర సహాయ సహకారాలు ఉండాలన్నారు. ఈ తరుణంలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు, కేవీ శివారెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రవికుమార్, రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఉద్యోగ సంఘ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు

రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌గా కృష్ణాజట్టు



మహిళల విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన కృష్ణాజట్టు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని డీఎస్‌ఏ మైదానంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా డీఎస్‌ఏ చీఫ్ కోచ్ అమృతరాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో కృష్ణాజట్టు చాంపియన్‌గా నిలిచింది. టీం ఈవెంట్ మహిళల విభాగంలో కృష్ణాజట్టు ప్రథమ, గుంటూరు జట్టు ద్వితీయ, కడప జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. పురుషులు టీం ఈవెంట్ విభాగంలో కృష్ణా, అనంతపురం , కడప జట్లు వరుసగా ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. మహిళల సింగిల్స్ విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన లావణ్య ప్రథమ, అనంతపురం జిల్లాకు చెందిన యశస్వి ద్వితీయ, కృష్ణాజిల్లా అనూష తృతీయ స్థానాలు సాధించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో వహీద్, సూర్యఆకాష్ ప్రణయ్‌లు రాణించారు. రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గాల్లో తేలినట్టుందే!



మదనపల్లె: తట్టివారిపల్లె బైపాస్‌రోడ్డులో ముందుకు లేచిన ఐషర్ లారీ

సాధారణంగా ఎవరైనా అధికబరువును మోస్తుంటే గాడిద బరువు మోస్తున్నాడనడం పరిపాటి. మోసేదానికన్నా అధిక బరువు వేస్తే జంతువే కాదు... యంత్రం సైతం మొరాయిస్తుందనేందుకు ఇదిగో ఇదే ఉదాహరణ. ఆదివారం మధ్యాహ్నం ఇనుపరేకులను వేసుకుని వెళుతున్న ఐషర్ లారీ అధిక బరువు కారణంగా అన్నమయ్య అన్నమయ్య జిల్లా తట్టివారిపల్లె బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో ఉన్నపళంగా ముందు టైర్లు లేచిపోవడంతో ముందుభాగం గాల్లో తేలుతూ కనిపించింది. దీన్ని అటుగా వెళుతున్న కొందరు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు తీసి వాట్సప్, ఫేస్‌బుక్‌లలో షేర్‌చేయడంతో ఎవరికి వారు తమకు తోచిన విధంగా కామెంట్లు, షేర్ చేసుకున్నారు. తర్వాత డ్రైవర్ మెకానిక్‌లను తీసుకొచ్చి వాహనాన్ని గాల్లో నుంచి కిందకు దింపి తిరిగి రోడ్డు బాట పట్టించాడు.

– మదనపల్లె

విజ్ఞాన వీచిక..సృజనకు వేదిక

- నేడు, రేపు జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన
- పులివెందులలోని ఆహోబిలాపురం జెడ్పీ హైస్కూల్ వేదికగా కార్యక్రమం





జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించనున్న పులివెందుల ఆహోబిలాపురం జెడ్పీ హైస్కూల్, ప్రాజెక్టుల ప్రదర్శనకు సిద్ధం చేసిన డెస్కులు

కడప ఎడ్యుకేషన్: శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి జరిగితేనే అన్ని రంగాల్లో పురోగతి సాధ్యమవుతుంది. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలు ఆధునిక టెక్నాలజీని స్వాగతిస్తున్నాయి. భారత దేశం సైతం శాస్త్ర, సాంకేతిక రంగాలకు పెద్దపీట వేస్తోంది. ఒక చిన్న ఆలోచనే పెద్ద ఆవిష్కరణలకు శ్రీకారం చుడుతుంది. ఇందుకోసం విద్యార్థులు తమలోని సృజనకు పదునుపెట్టి ప్రతిభ చాటేందుకు, చిన్నతనం నుంచే వారి దృష్టి శాస్త్ర, సాంకేతిక, పరిశోధన రంగాల వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా , సోమ, మంగళవారాల్లో జిల్లాస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నారు. పులివెందులలోని ఆహోబిలాపురం జెడ్పీ హైస్కూల్లో జరిగే కార్యక్రమానికి సంబంధించి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. ప్రారంభ కార్యక్రమానికి స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ సురేష్ కుమార్, జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జాయింట్ కలెక్టర్ సాయికాంత్‌వర్మ, ఎసీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, డీఈఓ దేవరాజు, సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి హాజరుకానున్నారు.

ఐదు ఉప అంశాలలకు ప్రాధాన్యత: నేడు, రేపు జరిగే జిల్లాస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ఐదు ఉప అంశాలపై ప్రాజెక్టులను సిద్ధం చేయాల్సి ఉంది. ఇందులో ఎకో ఫ్రెండ్లీ మెటిరియల్, హెల్త్ అండ్ క్లీన్ లైన్స్, సాఫ్ట్‌వేర్ అండ్ యాప్స్, ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ చేంజెస్, మ్యాథమ్యాటిక్స్ మోడలింగ్ అంశాలపై విద్యార్థులు ప్రాజెక్టులను ప్రదర్శించాల్సి ఉంది. జిల్లావ్యాప్తంగా 36 మండలాల నుంచి 180 ప్రాజెక్టులు జిల్లాస్థాయి ప్రదర్శనకు రానున్నాయి.

పకడ్బందీ ఏర్పాట్లు



జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు పులివెందులలోని అహోబిలాపురం పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులకు స్ఫూరించే ఆలోచనలను పంచుకోవడానికి సైన్స్ ఫేర్ సరైన వేదిక. అందువల్ల జిల్లాలోని అన్ని పాఠశాలల నుంచి ప్రాజెక్టులు తప్పనిసరిగా రావాలి.

– బి. మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి

మేధా సంపత్తిని వెలికి తీసేందుకే..



విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం పట్ల ఆసక్తి పెంచేందుకు ప్రతి సైన్స్ టీచర్ కృషి చేయాలి.విద్యార్థుల మేధాసంపత్తిని వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదపడుతాయి.వారికి కలిగిన అలోచనలను ప్రాజెక్టుల రూపంలో ప్రదర్శించవచ్చు.

– చెప్పలి. దేవరాజు, జిల్లా విద్యాశాఖాధికారి

19న 'భూతపురి' సాహిత్య పురస్కార ప్రదానం



భూతపురి సుబ్రమణ్యశర్మ

కడప కల్చరల్ : మహాకవి, శతావధాని డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ 86వ జయంతి సందర్భంగా 21వ స్మారక సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు డాక్టర్ భూతపురి సుబ్రమణ్యశర్మ స్మారక ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్య పీఠం అధ్యక్షులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, భూతపురి శివరామసురేంద్రశర్మ తెలిపారు. ఆదివారం ఉదయం 10.00 గంటలకు కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఈ కార్యక్రమం జరుగుతందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభకు యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.రంగ జనార్దన ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. ఈ సంవత్సరం పురస్కారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్యకు అందజేస్తామని చెప్పారు. నెల్లూరుకు చెందిన ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సభాధ్యక్షులుగా వ్యవహరిస్తారన్నారు. వైవీయూ కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య విశిష్ట అతిథిగా, తెలంగాణ విశ్వవిద్యాలయ సహాయ ఆచార్యులు డాక్టర్ సీహెచ్ లక్ష్మణ చక్రవర్తి ప్రధాన వక్తగా, సాహితీవేత్తలు మోక్షగుండం శ్రీనివాసమూర్తి, విద్వాన్ సమ్మెట శివశంకర్, జీవకళ సత్యనారాయణ ఆత్మీయ అతిథులుగా హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం


మగబిడ్డను తల్లికి అప్పగిస్తున్న 108 సిబ్బంది

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామం వద్ద 108 వాహనంలో ఆదివారం తెల్లవారుజామున ఓ గర్భిణి ప్రసవించింది. 108 వాహనం ఈఎంటీ ప్రణతి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముద్దనూరు మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన సుందరమ్మకు పురిటి నొప్పులు రావడంతో ఎర్రగుంట్ల 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నారు. మార్గంమధ్యలోని ఎర్రగుంట్ల మండల పరిధి పోట్లదుర్తి గ్రామ సమీపానికి రాగానే ఆమెకు పురిటి నొప్పులు అధికమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈఎంటీ ప్రణతి వైద్యం అందించి కాన్పు చేసింది. సుందరమ్మ మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో 108 వాహన పైలెట్ మనోజ్ పాల్గొన్నారు.

చౌక బియ్యం పట్టివేత


పోలీసులు పట్టుకున్న లారీ, బియ్యం

గోపవరం : మండలంలోని పి.పి.కుంట చెక్ పోస్టు వద్ద శనివారం రాత్రి రూ.11 లక్షల విలువ చేసే 600 బస్తాల చౌక బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. మైదుకూరు నుంచి కృష్ణపట్నం పోర్టుకు 600 బస్తాల లోడుతో లారీ వెళుతుండగా.. పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలో భాగంగా బద్వేలు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరుకు చెందిన శ్రీరామశ్రీనివాస్ అనే వ్యాపారి ఈ అక్రమ రవాణాకు పాల్పడగా.. అతనిని కూడా అదుపులోకి తీసుకున్నారు. రూ.11 లక్షల విలువ చేసే రేషన్ బియ్యంతోపాటు రూ.12 లక్షల విలువ చేసే లారీని కూడా సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగించగా, వ్యాపారి శ్రీరామ్‌శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు.

హత్యరాల.. బ్రహ్మోత్సవాల వేళ


పూజలందుకుంటున్న త్రేతేశ్వరస్వామి


ప్రత్యేక అలంకరణలో శ్రీకామాక్షీదేవి


శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయ ముఖద్వారం

- రేపటి నుంచి త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- 9 రోజుల పాటు వైభవంగా నిర్వహణ
- 18న శివరాత్రి, 19న కల్యాణం, 20న రథోత్సవం
- భారీగా తరలిరానున్న భక్తులు

రాజంపేట రూరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రముఖ శైవ క్షేత్రాలలో ఒకటైన హత్యరాలలో ఏటా వైభవంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలు వచ్చేశాయి. శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14 నుంచి 22 వరకు కొనసాగుతాయి. శివరాత్రి సందర్భంగా 17, 18, 19 తేదీల్లో ప్రధాన ఉత్సవాలు నిర్వహించనున్నారు. 18న వేల సంఖ్యలో భక్తులు దర్శించుకోనున్నారు. జాగారణ రోజు స్వామి వారి హరికథా కాలక్షేపానికి అధిక ప్రాధాన్యత ఇస్తారు. మూడు రోజుల పాటు దాతలు, సంఘ సేవకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు భక్తులకు ఉచితంగా అన్నదానాలు, మజ్జిగ, మంచినీటి సరఫరా వంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

18న లింగోద్భవం

18న (శనివారం) శివరాత్రిని పురస్కరించుకొని వేకువజాము నుంచే స్వామి వారి దర్శన సౌకర్యం కల్పించనున్నారు. కామాక్షిమాత, త్రేతేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఉదయం 9 గంటలకు కపాలేశ్వర ఉత్సవం, రాత్రి 7కు శిఖరదీపారాధన, రాత్రి 9కి లింగార్చన, 12కు లింగోద్భవం, ఒంటి గంటకు నంది ఉత్సవం నిర్వహించనున్నారు.

19న కల్యాణం

శ్రీకామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి కల్యాణాన్ని 19న (ఆదివారం) ఉదయం 9.20 నుంచి 10.30 గంటల వరకు వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 9కి అశ్వవాహనం, 10కి గజవాహనంపై స్వామి, అమ్మవారి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

20న రథోత్సవం

20న (సోమవారం) ఉదయం 10 గంటలకు రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. రాత్రి 8 గంటలకు హనుమంత వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఉంటుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు జిల్లా స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ప్రథమ బహుమతిగా రూ.50 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.40 వేలు, తృతీయ బహుమతిగా రూ.30 వేలు, చతుర్థ బహుమతిగా రూ.20 వేలు, పంచమ బహుమతిగా రూ.10 వేలు అందించనున్నారు. పోటీలలో పాల్గొనే వారు దేవస్థాన చైర్మన్ వీవీ సుబ్బారెడ్డి ఫోన్ నంబర్: 8790977712ను సంప్రదించాలి.

ప్రత్యేక ఏర్పాట్లు

17, 18, 19వ తేదీల్లో ఆర్టీసీ సంస్థ డీఎం సీ రమణయ్య ఆధ్వర్యంలో రాజంపేటలోని వైఎస్సార్ సర్కిల్ పాతబస్టాండు, చిట్వేలి నుంచి హత్యరాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తోంది. తహసీల్దార్ ముద్దా సుబ్రమణ్యంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్దనరెడ్డి, ఈఓ జీ కొండారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, రూరల్ ఎస్ఐ భక్తవత్సలంతో సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్ సమావేశమై ప్రజలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బ్రహ్మోత్సవాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. డీఎస్పీ జీ శివభాస్కర్‌రెడ్డి పర్యవేక్షణలో రూరల్ సీఐ పుల్లయ్య ఆధ్వర్యంలో శాంతిభద్రతలపై చర్యలు చేపడుతున్నారు. విద్యుత్‌శాఖ డీఈ ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, డీఈఈ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో విద్యుత్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బహుదానది తీరం వెంట బారీ కేడ్లను ఏర్పాటు చేయనున్నారు. భక్తుల కోసం స్నాన ఘట్టాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు.

గుండ్లూరు, ఊటుకూరులో..

మండల పరిధిలోని గుండ్లూరులో బహుదానది తీరాన వెలసిన శ్రీ కామాక్షి సమేత శ్రీఅగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. అన్నమాచార్య పూజలు చేసిన ఊటుకూరులోని శ్రీకామాక్షి సమేత శ్రీనాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ ఆలయాలలో 18న ఆది దంపతుల కల్యాణ వేడుకలు నిర్వహిస్తారు.

అన్ని శాఖల సమన్వయంతో..



అన్ని శాఖల అధికారుల సమన్వయంతో హత్యరాలలో శివరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. 9 రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం. ఇప్పటికే అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని వ్యవహారాలను చక్కదిద్దటంలో నిమగ్నమయ్యారు.

– జీ కొండారెడ్డి, దేవదాయశాఖ ఈఓ, రాజంపేట

భక్తులకు సౌకర్యాలు కల్పిస్తున్నాం



శివరాత్రి మహోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనివ్వకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. ప్రతి భక్తుడు స్వామి వారిని దర్శనం చేసుకొనేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఉత్సవాలలో పాల్గొని స్వామి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని భక్తులకు మనవి చేసుకుంటున్నాం.

– వెలగచెర్ల వెంకటసుబ్బారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్, శ్రీకామక్షి సమేత త్రేతేశ్వరస్వామి ఆలయం

బాధితుడిని ఆదుకుంటాం

- చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ యూత్ వింగ్ నాయకుడు
- ఆర్థిక సాయం అందజేసిన ఎంపీ, ఎమ్మెల్యే


బాధితుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

చాపాడు : బాధితుడిని అన్ని విధాలుగా ఆదుకుంటామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ స్టేట్ యూత్ వింగ్ జనరల్ సెక్రటరీ, ఖాజీపేట మండలం త్రిపురవరానికి చెందిన ఎం.వినోద్‌కుమార్ రెడ్డి ఇటీవల మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి వెన్నెముక దెబ్బతిని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రొద్దుటూరు పట్టణంలోని తన నివాసంలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో కలిసి ఆదివారం బాధితుడి తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందజేశారు. వినోద్‌కు మెరుగైన చికిత్స చేయించేందుకు ఎంత ఖర్చు అయినా భరిస్తామని ఎంపీ, ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

నేటి నుంచి ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని పెన్నానగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో సోమ, మంగళవారాలు నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు కోరారు. ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మహాసభల్లో ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి, రాష్ట్ర మాజీ నాయకులు, సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

చేనేతలకు చేయూతనివ్వాలి


మాట్లాడుతున్న అవ్వారు మల్లికార్జున

కడప రూరల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతలకు చేయూతనివ్వాలని చేనేత ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున కోరారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో చేనేత ఐక్యవేదిక రాష్ట్ర సర్వసభ్య సమావేశం రాష్ట్ర అధ్యక్షులు నీలూరి రుషీంగప్ప అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అవ్వారు మల్లికార్జున మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీతో కూడిన ముద్ర రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాలను విరివిగా అందించాలన్నారు. నిబంధనలతో సంబంధం లేకుండా చేనేత సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దక్షిణ భారత అధ్యక్షులు కొండప్ప, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఉపాధ్యక్షులు రామదాసు రామచంద్ర, రాయలసీమ అధ్యక్షులు రామచంద్ర, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, ప్రచార కమిటీ కార్యదర్శి వెంకట రమణ, మహిళా అధ్యక్షురాలు సీతాదేవి పాల్గొన్నారు.

గాయపడిన ఉపాధి కూలీ మృతి

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల సమీపంలో శనివారం ఉదయం గాయపడిన ఉపాధి కూలీ ఆదివారం మృతి చెందింది. పోరుమామిళ్ల పట్టణంలోని రంపాడు రోడ్డుకు చెందిన ఉపాధి కూలీ రామాయణపు మునెమ్మ(65) శనివారం ఉదయం పోరుమామిళ్ల సమీపంలోని చిన్న నరవ దగ్గర కందకం పనికి వెళ్లింది. అక్కడ మట్టిపై జారి కింద పడిపోగా ఉపాధి సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రూయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో మృతి చెందింది. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం ఆమె కుటుంబానికి అందజేస్తామని ఉపాధి హామీ పథకం ఈసీ ఖాజా తెలిపారు.

నూర్‌బాష్‌లను గుర్తించింది వైఎస్ కుటుంబమే

రాష్ట్ర నూర్‌బాష్ ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రసూల్


మాట్లాడుతున్న రాష్ట్ర నూర్‌బాష్ ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓ.రసూల్

కడప కార్పొరేషన్ : నూర్‌బాష్/దూదేకులను రాజకీయంగా గుర్తించింది వైఎస్ కుటుంబమేనని రాష్ట్ర నూర్‌బాష్ ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఓ. రసూల్ అన్నారు. ఆదివారం సాయంత్రం ఎర్రముక్కపల్లెలోని దూదేకుల సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దూదేకుల కులస్తులు 20 లక్షల వరకూ ఉన్నారని, జన గణన చేస్తే లెక్క సరిగ్గా తేలుతుందన్నారు. ఇప్పటి వరకూ అన్ని పార్టీలు దూదేకులను ఓటు బ్యాంకుగానే ఉపయోగించుకున్నాయి తప్పా వారికి ఎటువంటి మేలు చేయలేదన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మొదటిసారి దూదేకుల ఫెడరేషన్ ఏర్పాటు చేశారని, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దానికి నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశాయన్నారు. దూదేకులకు పించన్లు ఇవ్వాలని, సంఘానికి సేవ చేసే వారికి చట్ట సభల్లో స్థానం కల్పించాలని కోరారు. సంఘీయులు అంగీకరిస్తే కడప నగరంలోని దూదేకుల భవన్ అభివృద్ధికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ద్వారా కృషి చేస్తానన్నారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మూడు రాజధానులకు, ఎమ్మెల్సీలుగా పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డికి, ఎంవీ రామచంద్రారెడ్డిలకు మద్దతు ఇవ్వాలని సమావేశం తీర్మానించింది. ఈ సమావేశంలో సంఘ నాయకులు సుంకేసుల బాదుల్లా, కుళ్లాయప్ప, పి.పెద్దన్న, ఎస్.రెడ్డెయ్య, సుభాన్, దస్తగిరి, ఆర్.బాబు పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య


మృతి చెందిన రామిరెడ్డి

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లెలో యర్రిరెడ్డి రామిరెడ్డి (75) ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. తాళ్లప్రొద్దుటూరు ఏఎస్ఐ సుధాకర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కె.సుగుమంచిపల్లె గ్రామానికి చెందిన యర్రిరెడ్డి రామిరెడ్డి ఐదారేళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతుండే వాడు. ఈక్రమంలో జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మాజీ సైనికుల డిమాండ్లు నెరవేర్చాలి


సమావేశం నిర్వహిస్తున్న జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : మాజీ సైనికుల డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెరవేర్చాలని జిల్లా మాజీ సైనికుల అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రటరీ గోపాల్‌రెడ్డి కోరారు. కడపలోని సీఎస్ఐ స్కూల్‌లో ఆదివారం జిల్లా మాజీ సైనికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైనికుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సబ్సిడీలు, సౌలభ్యాలు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. వీటిని పారదర్శకంగా ఉంచడం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

భట్రాజులు బలమైన శక్తిగా ఎదగాలి


భట్రాజుల సంఘం జిల్లా నూతన కార్యవర్గం

కడప కల్చరల్ : భట్రాజులు బలమైన శక్తిగా ఎదగాలని వైఎస్సార్ జిల్లా భట్రాజ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు జనార్దన్‌రాజు అన్నారు. ఆదివారం కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులు అధికంగా ఉన్న భట్రాజులు ఇతర రంగాల్లో కూడా బలం పుంజుకోవాలని తెలిపారు. సంస్థ జిల్లా అధ్యక్షులు నిడుమోరు దేవేంద్రరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు.

సమాజంలో అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి చేరి కులస్తులంతా గర్వించేలా సేవలు అందించాలన్నారు. ప్రొద్దుటూరు డివిజన్ అధ్యక్షులు బడబాగ్ని వెంకట రమణరాజు మాట్లాడుతూ జాతి కోసం అందరినీ కలుపుకొని ఐక్యత చాటాలని సూచించారు.

నూతన కార్యవర్గం

జిల్లా కమిటీకి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా వరికుంట చంద్రమోహన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా అవధానం రఘురామరాజు, ముంగర రామచంద్రరాజు, బడబాగ్ని వెంకట రమణరాజు, కూనప మునిశేఖర్‌రాజు, కోశాధికారిగా గోపాలం మహేష్, సంయుక్త కార్యదర్శులుగా పేర్నపాటి రాజశేఖర్‌రాజు, పూనిపూర్తి శేషభాస్కర్‌రాజు, సత్యసాయి సుబ్బరాజు, అబ్బరాజు ప్రభాకర్‌రాజు, పాలగిరి సుధాకర్‌రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బద్వేలు డివిజన్‌కు కూడా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- కారును ఢీకొన్న లారీ
- ఇద్దరు మృతి
- ఐదుగురికి గాయాలు


ప్రమాదానికి కారణమైన లారీ


దెబ్బతిన్న కారు


వంశీకృష్ణ (ఫైల్)


నరేంద్ర (ఫైల్)

ఒంటిమిట్ట : అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండల పరిధి మంటపంపల్లె పంచాయతీలోని మంగంపేట గ్రామం వద్ద ఆదివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దైవ దర్శనానికి వెళ్తున్న వారి కారును ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా, ఐదుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిత్‌షాపూర్ గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనార్థం కారులో తిరుమల వెళ్తున్నారు. అన్నమయ్య జిల్లా ఒంటిమిట్ట మండల పరిధి మంటపంపల్లె పంచాయతీలోని మంగంపేట గ్రామం ఆంజనేయస్వామి గుడి సమీపాన ఉన్న కడప– చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే.. రాజంపేట నుంచి కడప వైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు అయింది. దీంతో కారులోని వంశీకృష్ణ(24) అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమంతు(24), కృష్ణవేణి(20), బిందేశ్వరి(19), రాము(25), నరేంద్ర(24)కు తీవ్రంగా, వెంకటేష్(23)కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్‌రావు తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులను 108 సాయంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న వారిలో నరేంద్ర(24) పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో బంధువులు, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఎస్ఐ మధుసూదన్‌రావు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకుని, పరారీలో ఉన్న డ్రైవర్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని యూటీఎఫ్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు మాదన విజయ్‌కుమార్ అధ్యక్షతన యూటీఎఫ్ కడప జిల్లా ప్రథమ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం అమలు పేరుతో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి అందకుండా చేస్తున్నారన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు, సహాధ్యక్షులు రవికుమార్, రూతు ఆరోగ్యమేరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా